RNI:APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

SINDHURA DARSINI TELUGU DAILY



4 లో సోమేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు

**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7 5 6 9 6 7 7 1 7 0

ప్రచురణ: తిరుపతి సంపుటి:2 సంచిక :205 | సంపాదకులు: కలిచేటి వెంకయ్య | గురువారం 15 మే 2025 | పేజీలు: 4 | వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad

# రాష్ట్రపతితో సీడీఎస్, త్రివిధ దళాధిపతుల సమావేశం




న్యూఢిల్లీ: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) అనిల్ చౌహాన్ సహా త్రివిధ దళాధిపతులు భేటీ అయ్యారు. ఇటీవల పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత్ బల గాలు చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయ వంతంగా ముగిసిన విషయం తెలిసిందే. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన సమగ్ర వివరాలను సైనిక ఉన్నతాధికారులు రాష్ట్రపతికి సమర్పించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా త్రివిధ దళాలు ప్రదర్శిం చిన ధైర్యసాహసాలు, కట్టుదిట్టమైన చర్యలను ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము ప్రశంసించారు.

**ఈ భేటీపై రాష్ట్రపతి భవన్ ట్వీట్**

"రక్షణ దళాల అధిపతి జనరల్ అనిల్ చౌహాన్, సైన్యాధ్యక్షుడు జనరల్ ఉపేంద్ర ద్వివేది, వైమానిక దళాల అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్, నావికా దళాల అధిపతి అడ్మిరల్ దినేశ్ కె.త్రిపాఠి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి ఆపరేషన్ సిందూర్ గురించి వివరించారు. ఉగ్రవాదంపై భారతదేశం యొక్క ప్రతి స్పందనను అద్భుతమైన విజయంగా మార్చిన సాయుధ దళాల శౌర్యం, అంకితభావాన్ని రాష్ట్రపతి ప్రశంసించా రని రాష్ట్రపతి భవన్ తన ట్వీట్‌లో పేర్కొంది.

## సింధూ జలాలపై కాళ్ల బేరానికి పాకిస్థాన్!

- భారత్‌కు విజ్ఞప్తి చేస్తూ లేఖ
- సింధూజలాల ఒప్పందంపై భారత్‌ను పునఃపరిశీలించమని కోరిన పాకిస్థాన్
- జలాల నిలిపివేతతో తీవ్రకరవు తప్పదని పాక్ జలవనరులశాఖ ఆందోళన
- ఈ విషయంపై చర్చలకు సిద్ధమని భారత ప్రభుత్వానికి పాక్ లేఖ



**సింధూరదర్శిని:** సింధూనదీ జలాల ఒప్పందం విషయంలో ఇదివరకు దూకుడుగా వ్యవహరించిన పాకిస్థాన్ వైఖరిలో మార్పు వచ్చినట్లు కనిపిస్తోంది. ఒప్పందాన్ని నిలిపివేస్తే ఎదురయ్యే తీవ్ర పరిణామాలను గ్రహించిన ఆ దేశం, ఈ అంశంపై తన నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని భారత్‌ను అభ్యర్థించింది. సింధూ జలాల విషయంలో తగ్గేది లేదని భారత్ పదేపదే తేల్చి చెప్పడంతో పాకిస్థాన్ తానే వెనక్కి తగ్గింది. ఈ మేరకు భారత ప్రభుత్వానికి లేఖ రాసింది. సింధూనదీ జలాలను భారత్ నిలిపివేస్తే తమ దేశంలో తీవ్రమైన దుర్భిక్ష పరిస్థితులు తలెత్తుతాయని ఆందోళన వ్యక్తం చేస్తూ పాకిస్థాన్ జలవనరుల మంత్రిత్వ శాఖ, భారత జలశక్తి మంత్రిత్వ శాఖకు ఒకలేఖ మిగతా 2లో...

## జీఎఫ్ఎస్టీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు మేధోమథనం వర్క్‌షాపులో సిఎం చంద్రబాబు



**విజయవాడ, సింధూరదర్శిని:**
పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జీఎఫ్ఎస్టీ సహకారంతో మురళీ ఫార్చ్యూన్ హోటల్‌లో బుధవారం టెక్ ఎ1 2.0 కాన్క్లేవ్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. జీఎఫ్ఎస్టీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు మేధోమథనం వర్క్ షాపు నిర్వహించారు. రాష్ట్రంలో లైవ్ స్టాక్ పరిస్థితి ఎట్లా ఉంది, రైతుల భాగస్వామ్యం, ఏ విధంగా పురోభివృద్ధి సాధించాలి, రైతులకు లాబాలను ఎలా తీసుకురావాలి అనే విషయాలపై చర్చించడం జరిగింది. రెండో రోజు నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. వివిధ స్టార్టప్ ప్రతినిధులు ముఖ్యంగా మిగతా 2లో...

## ఈ నెల 25న ప్రధాని మోదీ కీలక సమావేశం

### ఢిల్లీకి చంద్రబాబు, పవన్

- ప్రధాని మోదీ అధ్యక్షతన ఈ నెల 24 ఎన్డీఏ కీలక భేటీ
- ఆపరేషన్ సిందూర్, తదనంతర పరిణామాలపై చర్చించే అవకాశం
- ఆపరేషన్ వివరాలను నేతలకు వెల్లడించనున్న ప్రధాని మోదీ




**అమరావతి, సింధూరదర్శిని:**
ఆపరేషన్ సిందూర్‌తో దాయాదికి చుక్కలు చూపించిన తర్వాత ఎన్డీఏ కీలక భేటీ కాను ంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈనెల 25న సమావేశం జరగనుంది. ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్య మంత్రులు సైతం ఈసమావేశానికి హాజరు కానున్నారు. ఈ సమావేశంలో ఆపరేషన్ సిందూర్ చేపట్టడానికి గల ముఖ్య ఉద్దేశాన్ని ఎన్డీఏ నేతలకు వివరించనున్నట్లు సమాచారం. ఆపరేషన్‌లో ఉగ్రవాద శిబిరాలపై చేసిన దాడుల గురించి వివరించే అవకాశం ఉంది. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు దేశవ్యాప్తంగా రాజకీయ పార్టీలు, ప్రజల నుంచి ప్రశంసలు లభించాయి. ప్రతిపక్ష నేతలు సైతం మిగతా 2లో...

## దసరాలోగా చేనేత సహకార ఎన్నికలు

- త్వరలో హెల్త్ ఇన్సూరెన్స్ అమలు - రూ.5 కోట్ల త్రిఫ్ట్ ఫండ్ నిధులు కూడా విడుదల చేస్తాం
- 3 నెలలకోసారి ఆప్కో ద్వారా చేనేత దుస్తుల కొనుగోలు - ఎంఎస్ఎంఈ పార్కుల్లో చేనేతలకు పెద్దపీట
- వారానికోసారి చేనేత దుస్తుల ధరించడంపై విస్తృత ప్రచారం - సీఎం చంద్రబాబుతోనే చేనేతలకు స్వర్ణయుగం - రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత

**విజయవాడ, సింధూరదర్శిని:**
దసరాలోగా చేనేత సహకార సంఘ ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. చేనేతలకు త్వరలో హెల్త్ ఇన్సూరెన్స్ అమలు చేయనున్నామన్నారు. చేనేతల సంక్షేమానికి సీఎం చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యమిస్తున్నారని, చేనేత దుస్తుల అమ్మకాలు పెంచేలా కేంద్ర ప్రభుత్వ సహకారంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విజయవాడలో ఓ ప్రైవేటు కన్వెన్షన్ సెంటర్ లో రాష్ట్రంలో నలుమూలల నుంచి వచ్చిన నేతన్నలతో ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డితో కలిసి మంత్రి సవిత బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె చేనేత రంగ అభివృద్ధికి సూచనలు, ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ, చేనేతల అభివృద్ధికి మిగతా 2లో...



## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ గవాయ్

**న్యూఢిల్లీ:** రాష్ట్రపతి భవన్‌లో బుధవారం ఉదయం సుప్రీం కోర్టు 52వ ప్రధాన న్యాయ మూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ ప్రమాణం చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జస్టిస్ గవాయ్‌తో ప్రమాణం చేయించారు. ఈ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్, మిగతా 2లో...



## సింధూ జలాలపై కాళ్ల బేరానికి పాకిస్థాన్!

(మొదటిపేజీ తరువాయి)

రాసినట్లు సమాచారం. ఈ సున్నితమైన అంశంపై చర్చలు జరిపేందుకు పాకిస్థాన్ సిద్ధంగా ఉందని ఆ లేఖలో పేర్కొంది. నిబంధనల ప్రకారం, ఈ లేఖను భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు పంపినట్లు తెలుస్తోంది. అయితే, ఈ విషయంలో భారత్ తన వైఖరిని ఇదివరకే స్పష్టం చేసింది. "రక్తం, నీరు రెండూ ఏకకాలంలో ప్రవహించలేవు" అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గతంలోనే తేల్చిచెప్పారు. పాకిస్థాన్‌తో చర్చలు జరిగితే అవి కేవలం ఉగ్రవాదం నిర్మూలన, పీవోకేకు సంబంధించిన అంశాలపైనే ఉంటాయని స్పష్టం చేశారు. సింధూ జలాల ఒప్పందం విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని భారత ప్రభుత్వం పలుమార్లు స్పష్టం చేసింది.

## ఈ నెల 25న ప్రధాని మోదీ కీలక సమావేశం

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాని తీసుకున్న నిర్ణయాన్ని ప్రశంసించారు. అయితే భారత ప్రభుత్వం కాల్పుల విరమణకు అంగీ కరించడంతో ఎన్డీఏ ప్రభుత్వంపై విపక్షాల నుంచి విమర్శలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆపరేషన్ సిందూర్, అనంతర పరిణామాలపై ఎన్డీఏ నేతలకు అవగాహన కల్పించడం ద్వారా విమర్శలను తిప్పికొట్టేలా చేయాలని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఎన్డీఏ కీలక భేటీ జరగనుంది. ఉగ్రవాదులపై ప్రతీకారం తీర్చుకునేందుకు ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుందని మరోసారి స్పష్టం చేయనున్నారు. ఈ కీలక భేటీకి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ హాజరు కానున్నట్లు సమాచారం.

## జీఎఫ్ఎస్టీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు మేధోమథనం వర్క్‌షాపులో సిఎం చంద్రబాబు

(మొదటిపేజీ తరువాయి)

పౌల్ట్రీ రంగంలో రైతులు అనుసరించాల్సిన సాంకేతికతను, డైరీ స్టార్టప్, పిగ్గరీ స్టార్టప్ లాంటి వాటిపై ప్రజెంటేషన్ ను అందించారు. రాష్ట్రంలో పశువుల పెంపకంలో రైతులు చేపడుతున్న విధానాలు, గొర్రెలు, మేకల పెంపకంలో తమ అనుభవాలను రైతులు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రైతులకు ఏవిధంగా లాభం చేకూరుతుంది, రైతులకు ఎంత మేరకు ప్రయోజనం కలుగుతుందో అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వివిధ పథకాల ద్వారా అందిస్తున్న సహకారంపై ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. దేశంలో ఉన్న మంచి స్టార్టప్‌లను రాష్ట్రంలో కూడా అమలు చేసి రైతాంగానికి మేలు చేయాలన్నదే ప్రభుత్వ ఆలోచన అన్నారు. ముందుగా ముఖ్యమంత్రి అధికారులతో కలిసి మూడు పుస్తకాలను ఆవిష్కరిచడం జరిగింది. అనంతరం బయో లుంపివ్యాక్సిన్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆవిష్కరించారు. (పశువుల్లో స్కిన్ డిసీజ్ వాక్సిన్) కార్యక్రమంలో వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశు సంవర్ధక, డెయిరీ డెవలప్ మెంట్ మరియు ఫిషరీస్ శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి. రాజశేఖర్, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి, పశు సంవర్ధక శాఖ సంచాలకులు టి. దామోదర నాయుడు, జీఎఫ్ఎస్టీ డెరెక్టర్లు ఠక్కర్, కుటుంబరావు, సీఈవో సంజీవరావు, పశువుల పెంపకం రైతులు, వివిధ స్టార్టప్ ప్రతినిధులు తదితరలు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ గవాయ్

(మొదటిపేజీ తరువాయి)

లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, గవర్నర్లు తదితరులు హాజరయ్యారు. జస్టిస్ కేజీ బాలకృష్ణన్ తర్వాత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన రెండో దళిత వ్యక్తిగా జస్టిస్ బీఆర్ గవాయ్ రికార్డులకెక్కారు.జస్టిస్ గవాయ్ 1960 నవంబర్ 24వ తేదీన మహారాష్ట్రలోని అమరా వతిలో జన్మించారు. 1985 లో లా ప్రాక్టీస్ ప్రారంభించిన తర్వాత, భోసలే వంటి సీనియర్ న్యాయవాదుల తో కలిసి పనిచేశారు. అనతికాలంలోనే స్వతం త్రంగా ప్రాక్టీస్ చేయడం ప్రారంభించారు. ఆయన మునిసిపల్ కార్పొరేషన్లు, విశ్వవిద్యాలయాలు, కార్పొరేషన్లకు స్టాండింగ్ కౌన్సిల్‌గా కూడా పనిచేశారు.


## కృష్ణ వెన్నెల మహిళా సొసైటీ వారి ఆధ్వర్యం లో హెచ్.ఐ.వి. ఎయిడ్స్ పై అవగాహన


యన్టీఆర్ జిల్లా, సింధూరదర్శిని: జగ్గయ్యపేట లోని మార్కెట్ నందు వీధి నాటకం ద్వారా హెచ్ఐవి. ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశములు మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో కళాభారతి ప్రసాద్‌బాబు వారి కళాబృందంతో వీధి నాటకము ద్వారా హెచ్.ఐ.వి ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం వీధి నాటకం ద్వారా హెచ్ఐవి. ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి హెచ్ఐవి. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్న చూపు లేకుండా ఎలాగా సమాజంలో కలిసి జీవించాలి హెచ్ఐవి. ఎయిడ్స్ టీబీ. వ్యాధి. గురించి సుఖ వ్యాధులు మరియు చికిత్స గురించి కండోమ్ యొక్క ఉపయోగం గురించి. హెచ్ఐవి ఎయిడ్స్ యాక్ట్ గురించి 2017 కళా భారతి ప్రసాద్ బాబు కళా బృందం వారు చక్కగా అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో KVMS-PU.PD., షిబా, సిబ్బంది పాల్గొనడం జరిగింది .

## రైతు బజార్‌లో అదనపు షెడ్ల నిర్మాణం కొరకు పరిశీలన

నందిగామ, సింధూరదర్శిని: పట్టణ రైతు బజార్లో ఆకుకూరలు అమ్మేవారికి షెడ్ల నిర్మాణం లేక వర్షాకాలం ఇబ్బందులు గురవుతున్న విషయం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య దృష్టికి తీసుకెళ్లిన రైతులు. ఎమ్మెల్యే సౌమ్య ఆదేశాల మేరకు అధికారులు ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ డిఇ శేషగిరిరావు, ఏ ఈ ప్రసాద్ బుధవారం ఉదయం రైతు బజార్లో స్థల పరిశీలన చేశారు. ఎన్ని షెడ్ల నిర్మాణం చేస్తే ఆకుకూరలు అమ్మే రైతులుకు సరిపోతుందో ఆకుకూరల అమ్మే రైతులతో డి ఈ శేషగిరిరావు మాట్లాడారు. షెడ్ల నిర్మాణం అతి త్వరలో చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు బజార్ ఈవో రవికుమార్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.







# దసరాలోగా చేనేత సహకార ఎన్నికలు

(మొదటిపేజీ తరువాయి)

అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచి సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ రేయింబవళ్లు కృషి చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500యూనిట్ల విద్యుత్ ఉచితంగా అందజేస్తున్నామన్నారు. నూతన డిజైన్ల తయారీలో శిక్షణ ఇస్తున్నామన్నారు. తయారైన ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పించేలా ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మినీ కస్టర్లు, మెగా క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నామని, నూతన టెక్స్‌టైల్స్ పాలసీ తీసుకొచ్చామని తెలిపారు. 50 ఏళ్లు నిండిన నేతన్నలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం 92,724 మందికి రూ.4వేల పెన్షన్ ఇస్తున్నామన్నారు.

**దసరాలోగా సహకార సంఘ ఎన్నికలు**

చేనేత సహకార సంఘాల బలోపేతానికి సీఎం చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారని మంత్రి సవిత వెల్లడించారు. దీనిలో భాగంగా సహకార సంఘ ఎన్నికలు నిర్వహించడానికి కూటమి ప్రభుత్వం సమాయత్తమవుతోందన్నారు. దసరాలోగా చేనేత సహకార సంఘ ఎన్నికలు నిర్వహించనున్నామన్నారు. నూతన చేనేత సహకార సంఘాల ఏర్పాటుతో పాటు నిద్రావస్థలో ఉన్న సంఘాలను క్రియాశీలకంగా పనిచేసేటట్లు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

**3 నెలలకోసారి ఆప్కో ద్వారా కొనుగోలు**

నేతన్నలకు ఆర్థిక భరోసా కలిగించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి సవిత తెలిపారు. ప్రస్తుతం నేతన్నల నుంచి ఆప్కో ద్వారా ఆరు నెలలకోసారి దుస్తులు కొనుగోలు చేస్తున్నామన్నారు. ఇకపై మూడు నెలలకోసారి దుస్తులు కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. నేతన్నలకు బకాయిలను కూడా విడతలవారీగా చెల్లించున్నామన్నారు. త్రిఫ్ట్ పథకం కింద కేటాయించిన రూ.5 కోట్లను కూడా త్వరలోనే విడుదల చేయనున్నట్లు తెలిపారు.

**ఎంఎస్ఎంఈ పార్కుల్లో చేనేతలకు పెద్దపీట**

ఉపాధి కల్పనలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. ఈ పార్కుల్లో యూనిట్ల స్థాపనకు నేతన్నలకే పెద్దపీట వేస్తున్నామన్నారు. వర్క్‌షెడ్ల ఏర్పాటుకు చేయూతనందిస్తున్నామన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో చేనేతలకు అదనంగా రూ.50వేలు అందజేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. హైదరాబాద్‌లో ఉన్న ఎన్.హెచ్.డి.ఎస్. రీజనల్ కార్యాలయం విజయవాడలో ఏర్పాటు చేసేలా సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లనున్నామన్నారు. 90 శాతం సబ్సిడీతో ఆధునిక పనిముట్లు అందజేస్తామని, సీఎం చంద్రబాబుతోనే చేనేతలకు స్వర్ణయుగమని మంత్రి సవిత తెలిపారు.

**వారానికోసారి చేనేత దుస్తుల ధరించడంపై ప్రచారం**

చేనేత అమ్మకాలు పెరిగేలా కూటమి ప్రభుత్వం రాష్ట్రంతో పాటు జాతీయ స్థాయిలోనూ ఎగ్జిబిషన్లు ఏర్పాటుచేస్తోందని మంత్రి సవిత వెల్లడించారు. చేనేత దుస్తులకు మరింత ప్రాచుర్యం కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు త్వరలో ఓ నిర్ణయం తీసుకోనున్నాయన్నారు. రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు వారంలో ఒకరోజు చేనేత దుస్తులు తప్పనిసరిగా ధరించేలా రెండు ప్రభుత్వాలు త్వరలో ఓ పిలుపునివ్వనున్నట్లు మంత్రి వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లో చేనేత రంగానికి నిధులు కేటాయింపు పెంచేలా సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లనున్నామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో, దేశంలో డబుల్ ఇంజన్ సర్కార్ నడుస్తోందన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో ఏపీ చేనేత రంగానికి అధిక ప్రాధాన్యమిచ్చారన్నారు. మంగళగిరిలో ఏర్పాటు చేసిన వీవర్స్ శాల మాదిరిగా అన్ని జిల్లాల్లోనూ వీవర్స్ శాలలు ఏర్పాటు చేసి కార్మికులకు చేతినిండా పని కల్పిస్తామన్నారు.

రాష్ట్రంలో 2.50 లక్షల చేనేత కుటుంబాలు ఉన్నాయని వారి సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి అన్నారు. చేనేతలకు బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ-కామర్స్ మాద్యమం లో అమ్మకాలు జరపడం వలన ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. నూతన డిజైన్ల కోసం స్థానిక చేనేత కార్మికుల సలహాలు, సూచనలు తీసుకోవాలని కోరారు. సంచార వాహనాల ద్వారా మార్కెటింగ్ సౌకర్యాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చేనేత మరియు జౌళీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా మాట్లాడుతూ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సహకారంతో నిరంతరం పని కల్పించి మార్కెటింగ్ సౌకర్యాలను మెరుగుపరుస్తున్నామన్నారు. చేనేత సహకార సంఘాలు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కీలకంగా నిలుస్తున్నాయన్నారు. అనంతరం చేనేత మరియు జౌళీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల ఎగ్జిబిషన్ ను మంత్రి సవిత, ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, అధికారులు సందర్శించారు. ధరలు, నాణ్యతపై వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో చేనేత మరియు జౌళీ శాఖ కమిషనర్ రేఖారాణి, సెర్ప్ సీఈవో కరుణ, ఆప్కో వీసీ అండ్ ఎండీ ఎం.విశ్వ, పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ అబద్దయ్య, గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 21న విశాఖపట్నంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

## హాజరుకానున్న ప్రధాని- ఏర్పాట్లపై సిఎస్ సమీక్ష






విజయవాడ, సింధూరదర్శిని: జూన్ 21వ తేదీన విశాఖపట్నంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు జరగనున్నాయి. ఈవేడుకులకుప్రధాన మంత్రి నరేంద్ర మోడి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అందుకు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై బుధవారం విజయవాడలోని సిఎస్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సంబంధిత శాఖల అధికారులతో ప్రాథమికంగా సమీక్ష నిర్వహించారు.ప్రధానమంత్రి మోడి సూచనలతో 2014 డిసెంబరులో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించగా 2015 జూన్ 21వ తేదీన మొదటి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రధాని మోడి చేతుల మీదుగా ప్రారంభించగా ఒకే వేదికపై 35,985 మంది యోగాసనాలు చేసి రెండు గిన్నిస్ రికార్డులు సాధించడం జరిగింది.ఇప్పటి వరకు 10 అంతర్జాతీయ యోగా దినోత్సవాలు నిర్వహించుకోవడమైంది.మే 2న ప్రధాని అమరావతికి వచ్చినపుడు 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను విశాఖపట్నంలో నిర్వహించాలని ఆ వేడుకలకు తాను హాజరవుతానని సభా వేదిక నుండి ప్రకటించారు. అందుకు అనుగుణంగా జూన్ 21న విశాఖలో Yoga for One Earth,One Health అనే నినాదంతో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేయనుంది. ఈ ఏడాది 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణలో యోగా ప్రాముఖ్యతపై అవగాహన తెచ్చేందుకు ఇప్పటికే మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగా గత మార్చి 13 నుండి జూన్ 21 వరకు 100 రోజుల్లో 100 నగరాల్లో 100 ఆర్గనైజేషన్ల పేరిట గ్లోబల్ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది.దానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం "యోగాంధ్ర-2025" నినాదంతో ప్రజల్లో యోగాపట్ల అవగాహన కల్పించేందుకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటోంది. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ సహకారంతో ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఈశా ఫౌండేషన్,యోగా స్పోర్ట్స్ అసోసియేషన్, వివిధ విశ్వవిద్యాలయాలు తదితర సంస్థల భాగస్వామ్యంతో సుమారు 2లక్షల మందితో రాష్ట్ర ప్రభుత్వం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విశాఖలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

ముఖ్యంగా రానున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో యోగా పట్ల అవగాహన పెంపొందించి విజయవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 29వ తేదీ నుండి 4 వారాల నాలుగు అంచల ప్రచార కార్యక్రమ కార్యాచరణ ప్రణాళికను అమలు చేయనుంది.ఈనెల 29వ తేదీ నుండి మొదటి వారం రోజులు అన్ని జిల్లాల్లో జిల్లా స్థాయిలో యోగా అవగాహన ప్రచార కార్యక్రమాలు,జూన్ 5వ తేదీ నుండి వారం రోజుల పాటు అసెంబ్లీ నియోజకవర్గం స్థాయిలోను,జూన్ 12 నుండి వారం రోజుల పాటు గ్రామ స్థాయిలోను,జూన్ 17 నుండి విద్యా సంస్థల స్థాయిలో పెద్ద ఎత్తున అవగాహన ప్రచార కార్యక్రమాలు నిర్వహించ నుంది. ఈసందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానుద్ మాట్లాడుతూ విశాఖలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాల్సి ఉందని అన్నారు.ఏర్పాట్ల పర్యవేక్షణకు రాష్ట్ర స్థాయిలో వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి యం.టి.కృష్ణబాబును ప్రభుత్వం నోడలు అధికారిగా నియమించిందని తెలిపారు.కావున ఇప్పటి నుండే ఏర్పాట్లు ప్రారుభించాలని అధికారులను ఆదేశించారు.విశాఖపట్నం నగరంలోని వివిధ విద్యా సంస్థలకు చెందిన 8వ తరగతి మొదలు డిగ్రీ,పిజి చదివే విద్యార్థులు అందరినీ ఈకార్యక్రమంలో భాగస్వాములను చేయాలని చెప్పారు.అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆయుష్ మిషన్ ప్రతినిధులు, యోగా శిక్షకులు,యోగా స్పోర్ట్స్ అసోసియేషన్లు, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్లు,పిఇటిలు, స్పోర్ట్స్ కోచ్ లు,విశాఖలోని పలు కేంద్ర ప్రభుత్వ సంస్థలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలని సిఎస్ విజయానంద్ సూచించారు. ఈ సమావేశానికి ఢిల్లీ నుండి వర్చువల్ గా పాల్గొన్న కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి రాజేష్ మాట్లాడుతూ కొద్ది రోజుల్లో ఈవెంట్ మేనేజ్మెంట్ ను ఖరారు చేస్తామని, రెండు లక్షల టి షర్టులు, యోగా మ్యాట్లను రాష్ట్రానికి పంపనున్నట్టు చెప్పారు.ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. ఈసమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మరియు నోడలు అధికారి యం.టి.కృష్ణబాబు అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తూ ఈ వేడుకల్లో సుమారు రెండు లక్షల మంది పాల్గొనేలా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ త్వరలో ఈవెంట్ మేనేజ్మెంట్ ను ఖరారు చేయనుందని చెప్పారు.విశాఖలో ఈ ఈవెంట్ ను ఎక్కడ నిర్వహించాలనేది ఖరారు చేయాల్సి ఉందన్నారు.ఈసమావేశంలో రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా,వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ వీరపాండ్యన్, ఆయుష్ డైరెక్టర్ దినేష్ కుమార్ పాల్గొన్నారు.అలాగే పిఆర్ అండ్ ఆర్డి ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్, విద్యా శాఖ కార్యదర్శి కె.శశిధర్,సిఆర్డిఏ కమీషనర్ కె.కన్నబాబు,ఐటి శాఖ కార్యదర్శి కె.భాస్కర్, యువజన సర్వీసుల శాఖ కార్యదర్శి వినయ్ చంద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామాల అభివృద్ధి

### ఐదు గ్రామాలలో 150 సోలార్ లైట్లు ఏర్పాటు




గూడూరు( సింధూర దర్శిని) 14 మే తిరుపతి జిల్లా : చిల్లకూరు మండలం తీర ప్రాంతమైనటువంటి తమ్మిణ పట్నం పంచాయతీలో ఆధాని ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో గ్రామాల అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా ముందుకు సాగుతున్నాయి. ఇందుకు ముఖ్య కారకులు అధాని ఫౌండేషన్ హెడ్ రాజేష్ రంజాన్ మరియు వారి సహచర సిబ్బందికి తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి కోట సతీష్ యాదవ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. గుమ్మలదిబ్బ పాతూరు కొత్తూరు తమ్మినపట్నం హరిజనవాడ, ఎస్టి కాలనీ ఈ ఐదు గ్రామాలు కలిపి సుమారు 150 సోలార్ లైట్లు ఏర్పాటు చేయడం జరిగింది. ఇదే కాకుండా క్రీడాలకు సంబంధించి యువతను ఎంతగానో ప్రోత్సహిస్తూ సుమారు అన్ని గ్రామాలకు గాను ఐదు క్రికెట్ కిట్లు మరియు కబడ్డీ మ్యాట్ ఇస్తున్నారు. అంతే కాకుండా పిల్లలకు ఉత్తమ విద్యను కూడా కల్పిస్తున్నారు.అలాగే తమినపట్నం రెవెన్యూలో గల రైతులకు వ్యవసాయ పరికరాలు సబ్సిడీలో ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. అదానీ ఫౌండేషన్ రాజేష్ రంజన్‌కు, అండ్ టీంకి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపు కుంటూ వారు మరిన్ని సేవా కార్యక్రమాలు గ్రామాలలో విస్తృతంగా తీసుకెళ్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంతున్నామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మత్స్యకార సీనియర్ నాయకులు రామయ్య, తిరుపతి పార్లమెంట్ మత్స్య సెల్ కార్య నిర్వహణ కార్యదర్శి మేకల వెంకయ్య, గ్రామ తెలుగు యువత నాయకులు నాగూరు, సుబ్బయ్య, మహేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో రెండు పేషెంట్ బెడ్స్ బహుకరణ




గూడూరు(సింధూర దర్శిని) 14 మే తిరుపతిజిల్లా: చిల్లకూరు మండలంలోని చిల్లకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోటరీవెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో రొటేరి యన్ పీవీ సుధాకర్‌రావు, బండి ధనంజయరెడ్డిల దాతృత్వంతో రెండు పేషెంట్ పడకలను బుధవారం అందించడం జరిగింది.ఈ సందర్భంగా హాస్పిటల్ వైద్యాధికారి డాక్టర్ అరాఫత్ మాట్లాడుతూ రోటరీ వెస్ట్ క్లబ్ వారు మా హాస్పిటల్‌కి అవసరమైన రెండు పడకలను అందించటం అభినందనీయ మని, అందుకు సహకరించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. క్లబ్ అధ్య క్షులు నాశన నాగులు, సెక్రెటరీ చోళవరం గిరిబాబు, సీనియర్ రొటేరి యన్ ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, పీఎం రావు,సనత్ కుమార్‌రెడ్డి, సిద్ధారెడ్డి, డా "తేజస్విని, ఉమాపతి, రవికుమార్, బలరామిరెడ్డి, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# లిటిల్ ఏంజెల్స్ ప్రభంజనం



గూడూరు (సింధూర దర్శిని) 14 తిరుపతి జిల్లా : 2024-25 సి బి ఎస్ సి పదవతరగతి ఫలితాల్లో లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్‌స్కూల్ ప్రభంజనం సృష్టించింది. 500 మార్కులకు గాను 474 మార్కులతో పి. ఆధ్యా, పి.వెంకట శరణ్‌లు స్కూల్ టాపర్స్‌గా నిలిచారు. పరీక్షలకు హాజరైన 77మంది విద్యార్థులలో 51 మంది 80% మార్కులు సాధించగా, పరీక్ష రాసిన అందరూ విద్యార్థులు ప్రథమ శ్రేణి ఉత్తీర్ణత సాధించడం పాఠశాలకు విద్యార్థుల పట్ల ఉన్న అంకిత భావాన్ని తెలియజేస్తుంది. ఇంతటి అద్భుతమైన ఫలితాలను సాధించడంలో భాగస్వాములు అయిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పాఠశాల డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి అకాడమిక్ డైరెక్టర్ సుధేష్ణ, ప్రధానోపాధ్యా యులు సురేష్ కుమార్ రెడ్డి అభినందనలు తెలియజేశారు.

# ప్రతి ఒక్కరూ సేవా గుణం కలిగి ఉండాలి

### మయూరి శ్యామ్ యాదవ్



గూడూరు (సింధూర దర్శిని) 14 తిరుపతి జిల్లా: ప్రతి ఒక్కరూ సేవా గుణం కలిగి ఉండాలని శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్ యాదవ్ పేర్కొన్నారు.బుధవారం గుడూరు పట్టణంలోని గమళ్ళపాలెం ప్రాంతంలో ఉన్న ఓంసాయిరాం వృద్ధాశ్రమంలో మయూరి శ్యామ్ యాదవ్ దాతృత్వంతో అన్న దానాకార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పధాన్ని అలవర్చుకోవాలన్నారు.

# స్వయంశక్తి సంఘాల మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

**జిల్లా కలెక్టర్ ఆనంద్ పిలుపు - ఇందుకూరుపేటలో అరటి నార ఉత్పత్తుల శిక్షణ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్**



నెల్లూరు( సింధూర దర్శిని) 14 మే నెల్లూరు జిల్లా : ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని వినియోగించుకుని స్వయం శక్తి సంఘాల మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ పిలుపు నిచ్చారు. బుధవారం ఉదయం ఇందుకూరుపేట ఎంపిడివో కార్యాలయంలో డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అరటి నార ఉత్పత్తుల తయారీ శిక్షణా కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. అరటి నారతో ఏయే వస్తువులు తయారు చేస్తున్నారు, శిక్షణ ఎలా వుంది... శిక్షణ అనంతరం సొంతంగా వస్తువులు తయారుచేయగలరా? ఎంత ఖర్చు అవుతుంది.. ఎంత ఆదాయం వస్తుంది...మొదల్కెన విషయాలను మహిళలను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. మహిళలందరూ సొంతంగా ఆదాయం పొంది కుటుంబాన్ని అభివృద్ధి చేసుకోవడమే ప్రధాన ఉద్దేశంగా ఈ కార్యక్రమాన్ని అమలుచేస్తున్నట్లు చెప్పారు. అరటినారతో తయారైన అన్ని వస్తువులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించి మంచి ఆదాయం చూపిస్తామని, ప్రతిఒక్క మహిళ ఆసక్తిగా మంచి నైపుణ్యంతో శిక్షణ పూర్తి చేసుకోవాలని పిలుపునిచ్చారు. మహిళలందరూ ఈ శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఇంటి నుంచే మెరుగైన ఆదాయం పొందాలని కలెక్టర్ కోరారు. ప్రభుత్వపరంగా అన్నివిధాల సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ వ్యర్థాల నుండి సంపద సృష్టించాలనే ముఖ్యమంత్రి ఆలోచన మేరకు రీసైక్లింగ్ యాక్టివిటీస్ ను ముందుకు తీసుకు వెళ్లేందుకు అరటి నారతో వస్తువులు తయారు చేయడానికి మహిళలకు స్కిల్ ఇండియా మిషన్ సహకారంతో శిక్షణ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలోని ఇందుకూరుపేటలో 30 మంది మహిళలను ఒక బ్యాచ్‌గా ఎంపిక చేసి 30రోజుల పాటు శ్రీకాకుళం నుంచి ప్రత్యేకంగా విచ్చేసిన అప్పమ్మ ద్వారా శిక్షణ ఇప్పిస్తున్నట్లు చెప్పారు. ప్రతి కుటుంబం నుంచి ఒకరు పారిశ్రామికవేత్తగా తయారుకావాలనే సీఎం పిలుపు మేరకు జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా అరటినార ఉత్పత్తులపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలందరికీ అరటి నారా ఉత్పత్తులు తయారు చేసేందుకు అవసరమైన మిషనరీ కోసం రుణాలు ఇప్పిస్తామని, మంచి లాభం వచ్చేలా మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అరటినార ఉత్పత్తుల్లో ఎక్కువమంది మహిళలు యూనిట్లు స్థాపిస్తే ఒక క్లస్టర్ డెవలప్‌మెంటు ప్రోగ్రాంగా దీనిని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి మహిళ స్వశక్తితో స్వయం ఉపాధి పొందేందుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకోవాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజ కుమారి మాట్లాడుతూ ఇందుకూరుపేట మండలంలో అరటితోటలు అధికంగా వున్నాయని, పంట కోసిన తరువాత వృథాగా మిగిలే అరటి బెరడు నుంచి ఇంటికి అవసరమయ్యే అందమైన బుట్టలు, కుండీలు, సంచులు, మ్యాట్స్, ఇతర చిన్నచిన్న వస్తువులను తయారు చేసేలా శిక్షణ ఇప్పిస్తున్నట్లు చెప్పారు. ఈ శిక్షణ అనంతరంగా అరటి బెరడు ఉత్పత్తుల తయారీ మిషనరీ కోసం రుణాలు ఇప్పిస్తామని, ఇంటి నుంచే ఉపాధి పొందవచ్చని వివరించారు. ప్రతి మహిళ కూడా క్రమంతప్పకుండా వచ్చి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణప్రసాద్, ఏపిఎం సరిత, ఏరియా కోఆర్డినేటర్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# మెప్మా ద్వారా స్వయం సహాయక మహిళల ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలి : జిల్లా కలెక్టర్



తిరుపతి( సింధూర దర్శిని) 14 మే తిరుపతి జిల్లా : పట్టణ ప్రాంతాలలో గల పేద మహిళల ఆర్థిక సాధికారికత లక్ష్యంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఎస్ హెచ్ జి రుణాలు, బ్యాంకు లింకేజీ రుణాలతో పాటు ముద్ర, స్టాండప్ ఇండియా వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా రుణాలను అందించి వారి ఆర్థిక స్థితిని మెరుగు పరచవచ్చని అందుకు తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మెప్మా ద్వారా స్వయం సహాయక సంఘాలకు అందించే బ్యాంకు లింకేజీ, తదితర అంశాలపై మున్సిపల్ కమిషనర్ మౌర్య, మెప్మా పీడీ రవీంద్ర, ఎల్ డి ఎం. విశ్వనాథరెడ్డి, మున్సిపల్ కమిషనర్లు తో కలసి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... స్వయం సహాయక సంఘాలలోని మహిళలు మెప్మా ద్వారా ఆర్థిక సహాయంతో పాటు వారికి ఉన్నటువంటి యూనిట్ల ద్వారా అభివృద్ధి చెందడంతో పాటు నూతన యూనిట్ల ను ఏర్పాటు చేయాలని తెలిపారు. రాపిడ్ వెహికల్స్, తృప్తి క్యాంటీన్, టూరిజం సర్వీసెస్, అమృతమిత్ర వంటి స్పెషల్ ప్రాజెక్టులను ప్రారంభించడం ద్వారా ఎక్కువ మంది మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగే అవకాశం ఉంటుందని తెలిపారు. అందుకు సంబంధించిన లక్ష్యాలతో పాటు పూర్తిచేయాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులతోపాటు వారి కుటుంబ సభ్యులకు కూడా ఉపాధి కల్పించడం వలన ఆర్థిక అభివృద్ధి తో పాటు మహిళా సాధికారత సాధించేలా కృషి చేయాలన్నారు. జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలచే పెట్రోల్ బంకు నిర్వహణకు సంబంధించిన స్థల సేకరణ చేపట్టి పెట్రోల్ బంకు ఏర్పాటు కు సంబంధించిన పనులు ప్రారంభించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా పిడి రవీంద్ర, ఎల్ డి ఎం విశ్వనాథ రెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సుధాకర్ రావు, తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్య ఇతర మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# ఎస్టిమేషన్ కమిటీ సమావేశంలో గూడూరు ఎమ్మెల్యే పాశం

### పంచాయతీలలో సీసీ రోడ్లతోపాటు సైడ్ డ్రైనేజిలు ఏర్పాటుకు చర్యలు



గూడూరు (సింధూరదర్శిని) 14 మే తిరుపతి జిల్లా: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నియమించిన ఎస్టిమేషన్ కమిటీ సమావేశంలో భాగంగా అమరావతి నందు అధికారులతో జరుగుతున్న సమావేశంలో పాల్గొన్న గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ ఎన్ ఆర్ జి ఈ ఎస్ కింద పంచాయతీ లలో సీసీ రోడ్లు నిర్మిస్తున్నప్పటికి,సైడ్ కాలవులు ఏర్పాటు చేయకపోవడం వలన సీసీ రోడ్లు నిరూప యోగంగా ఉంటున్నాయి. కావున మహాత్మా గాంధీ ఎన్.ఆర్.జి. ఈ ఎస్ నిధులతో సైడ్ డ్రైన్ లు కూడా నిర్మించే విధముగా చర్యలు చేపడితే బావుంటుందని సమావేశంలో తెలిపారు. మహాత్మా గాంధీ ఎన్.ఆర్.జి ఈ ఎస్ కింద చేస్తున్న పనులకు కొంతమందికి ఇప్పటికి బిల్లులు అందలేదని, కావున ఆ బిల్లులు త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సమావేశం లో తెలిపారు. పంచాయతీ లలో వీధి లైట్ లు 24 గంటలు వెలుగుతున్నందున కరెంట్ బిల్ ఎక్కువ వస్తుంది,వీటికి ఆన్ , ఆఫ్ స్విచ్ లు ఏర్పాటు చేస్తే బావుంటుందని తెలిపారు. ఎస్ఇఆర్ పి లో పనిచేస్తున్న ఆర్ పి / వివో ఏ లును గతంలో రాజకీయల కోసం పనిచేయించారని, అలా కాకుండా వారిని వాటికి దూరంగా ఉంచి ప్రజలకు ఉపయోగపడే విధముగా మాత్రమే చూసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొత్తగా ఏర్పడిన కొన్ని అనుబంధం సంఘాల వివో ఏ లకు 2020 నుండి ఇప్పటి వరకు కూడా జీతాలు ఇవ్వలేదని, మా నియోజవర్గం నందు దాదాపుగా 8 సంఘాలకు ఇప్పటికి జీతాలు అందించలేదని, కావున ఒకసారి దీనిని కూడా పరశీలించాలని తెలిపారు. సి పి డబ్ల్యు స్కీం కింద గతంలో 50 లక్షలు అందించేవారు, ఇపుడు దానిని లెస్ చేసి 20 లక్షలు అందిస్తున్నారని, దీని వలన టెండర్ వేసే వారు లెస్ టెండర్ లు వేయడం వలన చేసే పనిలో నాణ్యత లోపం వచ్చే అవకాశం ఉన్నందున దీనిపై కూడా పునరాలోచించాలని సమావేశంలో తెలిపారు.

# టిడ్కో గృహాలలో వివాహిత ఆత్మహత్య



గూడూరు (సింధూర దర్శిని) 14 మే తిరుపతి జిల్లా: గూడూరు రూరల్ పరిధిలోని స్థానిక టిడ్కో గృహాల వద్ద ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. గూడూరు రూరల్ ఎస్.ఐ.మనోజ్ కుమార్ వివరాల మేరకు మను బోలు గ్రామానికి చెందిన గుణపాటి హేమలత (27) తన భర్త తో గొడవలు జరిగి మృతురాలు కురుగొండ గ్రామానికి చెందిన రషీద్ అను అతనితో సహజీవనం చేస్తూ ఉండేదన్నారు., వారిద్దరు 15 రోజుల నుండి గూడూరు టిడ్కో అపార్ట్మెంట్లో బాడుగకు తీసుకొని సహజీవనం సాగిస్తున్నారు అని అన్నారు. మృతురాలు ఈనెల 13 వ తేదిన రషీద్ తో నువ్వు నీ భార్య వద్దకు వెళ్ళవద్దని చెప్పగా, రషీద్ వెళ్లినందుకు మృతురాలు మనస్థాపం చెంది ఇంట్లో చీరతో ఉరివేసుకొని చనిపోయిందన్నారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# గుర్తుతెలియని మృతదేహం లభ్యం

## సంఘటన స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ గీతాకుమారి





గూడూరు (సింధూర దర్శిని) 14 మే తిరుపతి జిల్లా బీ స్థానిక సాయిబాబాగుడి సమీపంలోని చెరువుకట్ట వద్ద బుధవారం రాత్రి ఓ గుర్తుతెలియని వృద్ధుడు మృతదేహం లభ్యమైన సంఘటన చోటుచేసుకుంది. రూరల్ ఎస్. ఐ.మనోజ్ కుమార్ వివరాల మేరకు... స్థానిక సాయి బాబాగుడి సమీపంలోని చెరువుకట్ట వద్ద 55 ఏళ్లకు పైబడిన గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెంది ఉండటాన్ని స్థా నికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారన్నారు. మృతుడు తెల్ల చొక్కా, గల్లలుంగీ ధరించి ఉన్నాడన్నారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ గీతాకుమారి పరిశీలిం చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# గంగమ్మ హుండీ లెక్కింపు

తిరుపతి (సింధూర దర్శిని) 14 మే తిరుపతి జిల్లా : తిరుపతి లో ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగిన తాతయ్య గుంట గంగమ్మ జాతర లో భాగంగా ఏర్పాటుచేసిన ఐదు తాత్కాలిక హుండీల ద్వారా అమ్మవారికి వచ్చిన కానుకలు బుధవారం లెక్కించగా 10 లక్షల 69 వేల 618 రూపాయలు ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో జయకుమార్ ప్రకటనలో తెలియజేశారు.



# సోమేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు

## వైభవంగా రథోత్సవం – భారీ అన్నదాన కార్యక్రమం

గూడూరు( సింధూర దర్శిని) 14 తిరుపతి జిల్లా : గూడూరు పట్టణంలోని త్యాగరాజ వీధిలో ఉన్న శ్రీ మీనాక్షి దేవి సమేత సోమేశ్వరాలయంలో బుధవారం స్వామివారికి విశేష అలంకరణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించి అన్నప్రసాదాలు స్వీకరించారు. ప్రతి బుధవారం అన్నదాన కార్యక్రమం జరుగుతుందని ఆలయ పూజారి తెలిపారు.



# ఖేలో ఇండియాలో ప్రతిభ చాటిన టెన్నిస్ దిగ్గజం లక్ష్మి సిరి దండు

గూడూరు( సింధూర దర్శిని) 14 తిరుపతి జిల్లా : రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ టెన్నిస్ దిగ్గజం లక్ష్మి సిరి దండు బుధవారం పాట్నా లో జరిగిన ఖేలో ఇండియా టోర్నమెంట్లో పాల్గొని ప్రతిభ చాటింది. టెన్నిస్ క్రీడలో సింగిల్స్ విభాగంలో పాల్గొని కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. టెన్నిస్ క్రీడలో డబుల్స్ విభాగంలో పాల్గొని రజత పతకాన్ని సాధించింది. ఇప్పటికే జాతీయ టెన్నిస్ క్రీడల్లో రాణిస్తూ గూడూరు ఖ్యాతిని దేశమంతా వినిపిస్తోంది.




# బరువు తగ్గాల్సిన అవసరం ఉందా?

## రాత్రి భోజనంలో అలాంటి ఆహారాలు తినండి..











చాలా మందికి బరువు పెరగడానికి ఇబ్బంది ఉండదు. కానీ బరువు తగ్గడం వారికి పెద్ద సమస్య. శరీర ఊబకాయం కారణంగా ఏదైనా సామాజిక కార్యకలాపాల్లో పాల్గొనడానికి వారు పట్టించుకోవడం లేదు. ఈ సమయంలో, వారు బరువు తగ్గడానికి ప్రయత్నిస్తారు.

మార్కెట్లో లభించే బరువు తగ్గించే మాత్రలు, ఇతర వైద్యపరమైనవి తినడం ప్రారంభించినప్పుడు, మీరు తాత్కాలికంగా బరువు కోల్పోతారు, దాన్ని ఆపిన వెంటనే బరువు పెరుగుతారు. ఈ సమయంలో ఎటువంటి దుష్ప్రభావాలు లేని ఇంటి నివారణలు చాలా ప్రభావవంతంగా ఉంటాయి.

కొందరు త్వరగా బరువు తగ్గాలనే ఆశతో విందును కూడా దాటవేస్తారు. కానీ ఇది పరోక్షంగా బరువు తగ్గించే ప్రయత్నాలకు భిన్నంగా పనిచేయవచ్చు. ఇలా చేయడం వల్ల రాత్రి మీరు నిద్రపోకుండా చేస్తుంది. దాంతో రాత్రి మేల్కొని ఉండటానికి సహాయపడుతుంది మరియు అనారోగ్యకరమైన, అధిక కేలరీలు ఉన్న ఆహారాలను తినడం పెంచుతుంది.

ఇది మీ అభిరుచిని నాశనం చేయడమే కాదు, మరుసటి రోజు ఉదయం మీకు అలసట మరియు నీరసపరిచే అనుభూతిని కలిగిస్తుంది మరియు రోజు కార్యకలాపాలను నిర్వహించలేక పోతుంది. ఆహారం కూడా హెచ్చుతగ్గులకు లోనవుతుంది. అందువల్ల, బరువు తగ్గడానికి, మీరు బాగా నిద్రపోవాలి మరియు నిద్రించే ముందు మంచి పోషకమైన ఆహారాన్ని తినాలి. రండి, రాత్రిపూట తినగలిగే పది ఆరోగ్యకరమైన **ఆహారాన్ని చూద్దాం ...**

**చెర్రీస్**

ఇవి భోజనం తర్వాత ఆకలిని తీర్చడమే కాక, బాగా నిద్రపోవడానికి కూడా సహాయపడ తాయి. చెర్రీస్ లో మెలటోనిన్ అనే పోషకాన్ని కలిగి ఉంటుంది, ఇది నిద్రను నియంత్రిం చడంలో సహాయపడుతుంది. యాంటీఆక్సి డెంట్లు మరియు యాంటీ ఇన్ఫ్లమేటరీ ఏజెంట్లు దీనిని నివారించడంలో సహాయపడతాయి.


**పెరుగు:** వీలైతే గ్రీకు పెరుగు అయిన పెరుగును తీసుకురండి. ఇంట్లో స్వయంగా తయారుచేసే మోజారెల్లా కూడా మంచిది. రాత్రి భోజనంలో పెరుగు తీసుకోవడం మంచి ప్రోటీన్ మరియు తక్కువ చక్కెరను అంది స్తుంది. ప్రోటీన్ కడుపు నిండినట్లు చేస్తుంది మరియు రాత్రి సమయంలో కండరాలు పెరగడానికి సహాయపడుతుంది. ప్రోటీన్ శరీర కొవ్వును కరిగించి బరువు తగ్గడానికి సహాయపడుతుంది.

**వేరుశెనగ వెన్న:** బరువు తగ్గడానికి ఉత్తమ ఎంపిక ఏమిటంటే గోధుమ పిండితో తయారు చేసిన రొట్టె ముక్కపై వేరుశెనగ వెన్న లేదా వేరుశెనగ బటర్ పూత పూసి తినడం. పీనట్ బటర్ లో ప్రోటీన్ కండరాలను నిర్మించడానికి మరియు ఆరోగ్యకరమైన కడుపులను పూర్తిగా అనుభూతి చెందడానికి సహాయపడుతుంది.

కాటేజ్ చీజ్ కూడా బరువు తగ్గడానికి రాత్రి పడుకునే ముందు తినడానికి గొప్ప ఆహారం. కేసిన్ ప్రోటీన్ అధిక మొత్తంలో కడుపు నిండుగా ఉంచుతుంది మరియు దెబ్బతిన్న కండరాలను సరిచేయడానికి సహాయపడుతుంది. ఇది కేలరీలను తగ్గిస్తుంది మరియు అవాంఛిత కొవ్వును కరిగించడానికి సహాయపడుతుంది.

టర్కీ మాంసంలో లభించే ట్రిప్టోఫాన్ అనే పోషకం మీకు బాగా నిద్రించడానికి సహాయపడుతుంది మరియు రాత్రి బరువు తగ్గించేవారికి మంచి ఎంపిక. దీనిలోని ప్రోటీన్ కండరాలను నిర్మించడంలో సహాయపడుతుంది మరియు కొవ్వును కరిగించడం ద్వారా బరువు తగ్గడానికి కూడా సహాయపడుతుంది. టర్కీని శాండ్విచ్ రూపంలో తినడం మంచిది.

**చాక్లెట్ మిల్క్:**కొవ్వును కరిగించడానికి చాక్లెట్ బ్లెండెడ్ పాలు కూడా చాలా బాగుంటుంది. పాలలో కాల్షియం బొడ్డు కొవ్వును కరిగించ డానికి సహాయపడుతుంది. ఒక అధ్యయనం ప్రకారం 1000 మిల్లీగ్రాముల కాల్షియం తీసు కోవడం వల్ల 18 పౌండ్ల కొవ్వు కరిగిపోతుంది.



పాలలో విటమిన్ డి కాల్షియం గ్రహించడానికి సహాయపడుతుంది.

**బాదం:** ఇందులో ఐదు గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. ఇది దెబ్బతిన్న కండరాలను రాత్రి పూట రిపేర్ చేయగలదు. బాదంపప్పులో కరిగే ఫైబర్ కడుపు నిండినట్లు చేస్తుంది మరియు ఎక్కువగా తినకుండా నిరోధిస్తుంది. కొవ్వును కరిగించడానికి బాదం గొప్ప ఆహారం.

**అధిక ఫైబర్ ఆహారాలు**

అధిక మొత్తంలో కరగని ఫైబర్ ఉన్న ఆహారాన్ని రాత్రి తరచుగా తినాలి. అధిక ఫైబర్ తృణ ధాన్యాలు మంచి ఎంపిక. కరగని ఫైబర్ తీసుకోవడం కొవ్వును కరిగించడానికి మరియు బరువు తగ్గడానికి సహాయపడుతుందని ఒక అధ్యయనం కనుగొంది.

గ్రీన్‌టీ వల్ల అనేక ఆరోగ్యకరమైన ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా గుండె ఆరోగ్యం, మానసిక ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుంది. రాత్రి భోజనం తర్వాత ఒక కప్పు గ్రీన్ టీ తీసుకోవడం ద్వారా, మీరు బరువు పెరగవచ్చు,

అదే సమయంలో ఈ ప్రయోజ నాలను కూడా పొందవచ్చు. గ్రీన్ టీలోని కొన్ని పోషకాలు ముఖ్యంగా రాత్రి సమయంలో ఎక్కువ కొవ్వును కరిగించే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. గుడ్లలో ప్రోటీన్ మరియు ఇతర పోషకాలు అధికంగా ఉంటాయి మరియు రాత్రి భోజనంలో చేర్చడానికి మంచి ఎంపిక. ఒక పెద్ద గుడ్డు దెబ్బై ఎనిమిది కేలరీలను కలిగి ఉంటుంది మరియు ఇతర పోషకాలతో సమృద్ధిగా ఉంటుంది. కాబట్టి ఈ వ్యాసం మీకు ఉపయోగకరంగా ఉందని మీరు భావిస్తే, మీ స్నేహితులతో పంచుకోండి.









Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKU-RU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410.